

ఆంధ్రభూమి వీక్లీ 31 జూలై 2003

ఓ టీ.వీ. ఛానెల్ నిర్వహిస్తున్న పాటల కార్యక్రమంలో పాల్గొంటున్న మా అమ్మాయికి తోడుగా హైదరాబాద్ వచ్చాము... నేనూ, నా భార్య రాధిక.

షూటింగ్ పూర్తయ్యాక తిరిగి తిరుపతి ప్రయాణమయ్యాం ముగ్గురం!

నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణం సుఖంగానే సాగింది... మరుసటి రోజు ఉదయం వరకూ.

ప్రొద్దున ఆరుగంటలకు నిద్రలేచి బ్రష్ చేసుకుని, ముఖం కడుక్కుని వస్తూంటే కనిపించారు– ఆ జంట!

మా కూపేకు ప్రక్కనున్న కూపేలో సైడ్‌బెర్త్ మీద కూర్చునివున్నారు వారు. ఒకేవైపు ఇరుక్కుని కూర్చునివున్నారు ఇద్దరూ. అతడు కిటికీలోంచి బయట కనిపిస్తున్నదేదో చూపిస్తూంటే... ఆమె నవ్వుతోంది.

'కొత్తగా పెళ్లైన జంట కాబోలు...' అనుకున్నాను.

నా సీట్లో కూర్చుని- నా ప్రక్కన కూర్చున్న అబ్బాయిని చూశాను.

అతడు వారివంకే చూస్తున్నాడు. అతడు నిన్న సాయంత్రమే పరిచయమయ్యాడు. పేరు... చైతన్య! హైదరాబాద్‌లో ఇంజనీరింగు మూడవ సంవత్సరం చదువుతున్నాడట! తిరుపతిలోని తన మేనత్త ఇంటికి సెలవులు గడపటానికి వెళ్తున్నాడు.

మళ్లీ ఆ జంట వైపు చూశాను...

అతను తన తలని ఆమె భుజంపై ఆన్చి, ఆమె ఎడమ చేతిని తన రెండుచేతుల్లో గట్టిగా పట్టుకొని, తన చెంపకు ఆనించుకుని ఏదో చెప్తూంటే... ఆమె ఆసక్తిగా వింటోంది.

ఎందుకో... ఆ దృశ్యం నాకు కాస్త ఇబ్బంది కలిగించింది.

చైతన్య కూడా తల తిప్పుకొని ఎటో చూస్తున్నాడు. అతనిక్కూడా బహుశా వాళ్ళ ప్రవర్తన ఎబ్బెట్టుగా అనిపించి ఉండొచ్చు. అదృష్టవశాత్తూ నా పదిహేనేళ్ల అమ్మాయి మాత్రం కిటికీ దగ్గర కూర్చొనివుండటం వల్ల వీళ్ళ చేష్టలు ఆమె కంట్లో పడలేదు.

ఈమధ్య తరచుగా నాకు ఇటువంటి సన్నివేశాలు ఎదురవుతున్నాయి ప్రయాణాల్లో. 'సభ్యత... అన్నది మరచిపోతున్నారు మనుషులు!' అనుకున్నాను.

నా భార్యతో ఏదో పిచ్చాపాటీ మాట్లాడుతూ మళ్లీ ఆ జంట వైపు చూశాను.

ఈసారి సీను మారింది... అతడు తన తలని ఆమె ఒడిలో పెట్టుకుని పడుకుని ఉన్నాడు. ఆమె అతని తలవెంట్రుకల్ని సవరిస్తోంది.

క్షణక్షణానికీ ఆ జంటపై ఏహ్యత పెరుగుతోంది నాలో! ఉదయం ఏడు గంటలకు అందరూ మెలకువగా కూర్చుని ఉండగా- అంత వయసొచ్చినవాడు ఇంకా చిన్నపిల్లవాడిలా పడుకోవడం, అదీ భార్య ఒడిలో తలపెట్టుకుని పడుకోవటం... నాకు విపరీతమైన కోపాన్ని తెప్పించింది.

వెళ్లి నాలుగు చీవాట్లు వేసివద్దామని కూడా అనుకున్నాను... కాని, ధైర్యం చాలలేదు.

పావుగంట తర్వాత మళ్లీ సీను మారింది... ఇద్దరూ ప్రక్కప్రక్కనే కూర్చుని భుజాలవరకూ దుప్పటి కప్పుకొని ఉన్నారు. అతడు తన తలని ఆమె తలకు ఆన్చి ఉన్నాడు. ఆమె అతన్ని చూసి చిలిపిగా నవ్వుతోంది.

ఇక చూడలేక ఎదుటి బెర్తుకి మారాను. మా అమ్మాయి ప్రక్కనే కూర్చుని చైతన్య వైపు చూశాను.

'మీ బాధ నాకు అర్థమైంది..!' అన్నట్లు నవ్వాడు.

తర్వాత లేచి అక్కడ్నుంచి కదిలాడు. 'బహుశా- అతనిలోనూ అసహనం పెరిగి, తలుపు దగ్గరకి వెళ్లి నిలబడ్డాడేమో...' అనుకున్నాను.

ఇంతలో... ప్రక్క కూపే నుంచి అరుపులు వినిపిస్తే- గబుక్కున లేచి వెళ్లిచూశాను.

ఆ అమ్మాయి నిలబడి అరుస్తూ ఉంది. చైతన్య ఆమె ప్రక్కన తలవంచుకుని నిలబడివున్నాడు.

"ఏం జరిగిందమ్మా?" ఒకావిడ అడిగింది ఆ అమ్మాయిని.

"మా ఆయన టాయిలెట్‌కని వెళ్లారు. ఆయనటు పోగానే వీడొచ్చి ఏ ఊరని అడిగాడు. హైదరాబాద్ అని చెప్పాను. అడ్రెసు చెప్పు... మీ ఇంట్లో ఎవరూ లేనప్పుడు వస్తాను. ఎంత డబ్బైనా ఇస్తాను..." అంటున్నాడు అంది- దాదాపు ఏడుస్తూ.

అంతలో... ఆమె భర్త వచ్చి చైతన్య కాలర్ పట్టుకుని, "రాస్కెల్! ఎంత ధైర్యంరా నీకు?" అన్నాడు.

"చెయ్యి తియ్యి మిస్టర్! నేను నీకు పోటీకి రాలేదు. ఆమె ఎప్పుడు ఫ్రీగా ఉంటే అప్పుడే వస్తానని చెప్పాను" అన్నాడు చైతన్య కొంచెం కూడా బెదరకుండా.

అతని ధైర్యం చూసి నాకు ఆశ్చర్యం వేసింది. అయితే అతని ప్రవర్తన ఎంతో బాధ కలిగించింది. 'అయినా... తప్పు ఆ అబ్బాయిది కాదు- అతన్ని ప్రేరేపించేలా ప్రవర్తించిన ఆ జంటదే!' అనుకున్నాను.

"స్కౌండ్రల్... ఆమె నా భార్యరా!"

"అంటే... మీరిద్దరూ భార్యాభర్తలా?" ఆశ్చర్యంగా అడిగాడు చైతన్య.

"ఏం... డౌటా? నీకు ఋజువులు చూపాలా?" వెటకారంగా అన్నాడు ఆ అమ్మాయి భర్త.

"అఖ్ఖర్లేదు. 'మీరిద్దరూ భార్యాభర్తల్లా కనిపించారా..?' అని ఇక్కడున్న వాళ్ళను చెప్పమనండి!"

ఎవరూ మాట్లాడలేదు.

"మీ చేష్టలు చూస్తుంటే భార్యాభర్తలు కలిసి ప్రయాణం చేసినట్లు మాకెవరికీ అనిపించలేదు. వయసులో పెద్దవాళ్ళు, చిన్నపిల్లలు చూస్తున్నారన్న ఇంగితజ్ఞానం లేకుండా, మనం సభ్యసమాజంలో బ్రతుకుతున్నాం అన్న నిజాన్ని మరచి మీరు ప్రవర్తించిన తీరు చూసి అలా మాట్లాడాను. మీరు నిజంగానే భార్యాభర్తలైతే నన్ను క్షమించండి!" అంటూ వచ్చి తన సీట్లో కూర్చున్నాడు.

వాళ్ళిద్దరి ముఖాలు నల్లబడ్డాయి అవమానంతో. ఇద్దరూ మెల్లగా కూర్చున్నారు తమ మధ్య కొంత దూరాన్ని వదలి.

చైతన్య వాళ్ళకు బుద్ధి చెప్పడానికి అలా ప్రవర్తించాడని అందరికీ అర్థమైంది. ఆ జంట ఇక జీవితంలో అలా సభ్యత మరచి ప్రవర్తించరని నాకు అనిపించింది.

మెచ్చుకోలుగా చైతన్య వైపు చూసి నవ్వాను.

అతనూ నవ్వాడు... 'మీరు చేయలేని పని నేను చేశా'నన్నట్టు!